ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

ఆదివారం 16 జూన్ 2024



జీసీసీ గోదాములపై విజిలెన్స్

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ గోదాములను విశాఖ జీసీసీ ముఖ్య కేంద్ర కార్యాలయం విజిలెన్స్ అధికారి ఎంవీవీఎస్ ఉమాదేవి శనివారం పరిశీలించారు. మండల కేంద్రంలో గ్యాస్, బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు ఉంచే గోదాములను పరిశీలించారు. అనంతరం సేల్స్ డిపోలను కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ బ్యాలెన్స్ రికార్డులు పరిశీలించారు. వాటిపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని ఆమె తెలిపారు. ఈ పరిశీలనలో గుమ్మలక్ష్మీపురం జీసీసీ మేనేజర్ కృష్ణ ప్రసాద్, గోదాం ఇన్‌చార్జి సాంబశివరావు తదితర సిబ్బంది ఉన్నారు.

శాఖల్లో ప్రక్షాళన

- తప్పు చేస్తే చట్టపరంగా శిక్ష తప్పదు
- విద్యార్థుల మరణాల నివారణకు చర్యలు
- గిరిజన గర్భిణుల వసతిగృహాలపై ప్రత్యేక దృష్టి
- జిల్లా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా..
- 'ఆంధ్రజ్యోతి'తో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

పార్వతీపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి)/సాలూరు: టీడీపీ అధినేత చంద్రబాబు తనకు కేటాయించిన మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖల్లో పూర్తిస్థాయిలో ప్రక్షాళన జరుగుతుందని, ఎవరైనా తప్పు చేస్తే చట్టపరంగా శిక్ష తప్పదని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. శనివారం ఆమె సాలూరులోని తన నివాసంలో 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. 'గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాల నివారణకు చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తాం. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఆశ్రమ పాఠశాలల్లో ప్రత్యేక ఏఎన్ఎంలను నియమిస్తాం. ఎప్పటికప్పుడు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తాం. జిల్లాలోని గిరిజన గర్భిణుల వసతి వసతిగృహాల పటిష్టతకు చర్యలు తీసుకుంటాం. గిరిజన ప్రాంతాల్లో మాతా శిశు మరణాల నివారణకు కృషి చేస్తాం. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాలు వేగవంతంగా పూర్తయ్యేలా చూస్తాం. ఏజెన్సీ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. గిరిపుత్రులకు డోలీ కష్టాలు తప్పిస్తాం. గిరిజన గర్భిణులకు ప్రసవ వేదన లేకుండా చేస్తాం. ప్రతిఒక్కరికీ విద్య, వైద్యం అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటాం. గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరిస్తా. సాగుకు అవసరమైన నీటిని అందిస్తాం. అంగన్‌వాడీల ద్వారా లబ్ధిదారులందరికీ పౌష్టికాహారం అందేలా చూస్తాం. జిల్లాలో ఐటీడీఏల సమావేశం త్వరితగతిన ఏర్పాటు చేస్తాం. స్త్రీ శిశు, గిరిజన సంక్షేమ శాఖల ద్వారా ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరే విధంగా ప్రజలకు సేవలు అందిస్తా. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడంతో పాటు పెండింగ్ పనులు పూర్తి చేస్తాం. పార్వతీపురంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణం వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. జిల్లా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం' అని మంత్రి తెలిపారు.

ప్రజలకు రుణపడి ఉంటా..


ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని మంత్రి సంధ్యారాణి తెలిపారు. శనివారం ఆమె స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అందరి ఆశీర్వదంతోనే తాను ఎమ్మెల్యేగా గెలుపొంది, మంత్రిగా అయ్యానని అన్నారు. పార్టీ శ్రేణుల శ్రమ కూడా మరువలేనిదన్నారు. వారే తన బలం, బలగం అని తెలిపారు. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో నమ్మకంతో రెండు కీలక శాఖలను అప్పగించారని, బాధ్యతగా పనిచేయడమే తన కర్తవ్యమని స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, నాయకులు వేణు, ప్రసాద్‌బాబు, పరమేష్, సూర్యనారాయణ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



మంత్రి సంధ్యారాణికి అభినందనలు తెలుపుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కొలిక్కి వచ్చేనా..?

- ఒడిశాతో కొనసాగుతున్న జల వివాదం
- ఏళ్లు గడుస్తున్నా.. పూర్తికాని జంఝావతి ప్రాజెక్టు పనులు
- ప్రస్తుతం రాజకీయ పరిస్థితులు అనుకూలం
- ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం
- ఒడిశాలో మొదటిసారి కొలువుదీరిన బీజేపీ సర్కారు
- రైతుల్లో చిగురిస్తున్న ఆశలు



జంఝావతి రిజర్వాయర్

(కొమరాడ)

జంఝావతి ప్రాజెక్టు సమస్యకు చెక్ పడేనా? దశాబ్దాలుగా ఒడిశాతో కొనసాగుతున్న జల వివాదానికి తెర పడేనా?.. రాజకీయ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో.. సర్వత్రా ఇప్పుడిదే చర్చనీయాంశమవుతోంది. ప్రస్తుతం ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టింది. ఒడిశాలో తొలిసారిగా బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో ఇరు రాష్ట్రాల నేతలు చొరవ తీసుకుంటే.. ఈ వివాదం త్వరలోనే పరిష్కారం కానుందని రైతులు భావిస్తున్నారు. వాస్తవంగా నాలుగున్నర దశాబ్దాలుగా ఒడిశాతో జల వివాదం నెలకొంది. ఏపీ నుంచి మెరుగైన ప్యాకేజీ, పరిహారం ప్రకటించినా ఒడిశా మాత్రం ప్రాజెక్టు నిర్మాణానికి సహకారం అందించడం లేదు. రెండు రాష్ట్రాల మధ్య ప్రాజెక్టు కోసం గతంలో చర్చలు జరిపినా వివాదం కొలిక్కిరాలేదు. ఫలితంగా 25 వేల ఎకరాలల్లో సగం ఆయకట్టుకు కూడా జంఝావతి నుంచి సాగునీరందడం లేదు. దీంతో జిల్లా పరిధిలో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏటా వరుణుడిపైనే ఆధారపడి సాగు చేపట్టాల్సి వస్తోంది. కాగా ప్రస్తుతం ఇరు రాష్ట్రాల్లో ఎన్డీఏ ప్రభుత్వాలే కొలువుతీరడంతో ఈ ఐదేళ్లలోనైనా ప్రాజెక్టుకు మోక్షం కలుగుతుందన్న ఆశతో రైతులు ఉన్నారు.

ఇదీ పరిస్థితి..

సుమారు 25 వేల ఎకరాలకు సాగునీరందించాలని లక్ష్యంగా 1976లో కొమరాడ మండలంలో జంఝావతి నదిపై ప్రాజెక్టు నిర్మాణానికి రూపకల్పన చేశారు. కాగా ఇప్పటివరకు సుమారు రూ. 175 కోట్లు ఖర్చు చేసి స్పిల్‌వే, రెగ్యులేటర్, ప్రధాన మట్టికట్ట వంటి కీలక నిర్మాణాలు పూర్తి చేశారు. అయితే జలాశయంలో నీటి నిల్వకు గాను నదీ ప్రవాహాన్ని మళ్లించే రివర్ గ్యాప్ పనులు మాత్రం ఒడిశా అభ్యంతరంతో పూర్తికాలేదు. ఈ పనులు పూర్తి చేస్తే ఒడిశాలో 117 ఎకరాలు ముంపునకు గురికావడమే కాకుండా సుమారు 300 కుటుంబాలు నిర్వాసితులుగా మారుతారని ఆ రాష్ట్ర ప్రభుత్వం వాదన. ముంపునకు గురవుతున్న భూమికి బదులు భూమితో పాటు మెరుగైన పరిహారం, ప్యాకేజీ ఇచ్చేందుకు గతంలో ఏపీ ప్రభుత్వం ముందుకు వచ్చింది. అయినా ఎటువంటి ఫలితం లేకపోయింది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎంపీలు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పూసపాటి అశోక్ గజపతిరాజు ఒడిశా అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చలు జరిపారు. అయినప్పటికీ ఎటువంటి పురోగతి లేదు. ఒడిశా ససేమిరా అనడంతో జల వివాదం కొనసాగుతూనే ఉంది.

రబ్బరు డ్యాం నిర్మించినా..

రివర్ గ్యాప్‌లో వృథాగా పోతున్న నీటిని ఒడిసిపట్టి రైతులకు అందించాలని 2006లో సుమారు రూ. 6 కోట్లతో రబ్బరుడ్యాం నిర్మించారు. అయితే కోట్లు వెచ్చించినా.. లక్ష్యం మాత్రం నెరవేరలేదు. దీంతో గరుగుబిల్లి, పార్వతీపురం, కొమరాడ సీతానగరం మండలాల పరిధిలో రైతులకు సాగునీటి ఇక్కట్లు తప్పడం లేదు. జంఝావతి రబ్బరుడ్యాం ద్వారా దిగువ కాలువ ద్వారా 12 వేల ఎకరాలకు, ఎత్తిపోతల పథకం-1 ఆర్‌టీ ద్వారా మరో 12 వేల ఎకరాలకు సాగునీరందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ స్థాయిలో సాగునీరందడం లేదు. కేవలం 8 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరందుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఇరు రాష్ట్రాల నేతలు, అధికారులు స్పందించి జల వివాదం కొలిక్కి తేవాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

ప్రాజెక్టు పూర్తయితే మేలు..

జంఝావతి జలాశయం నిర్మాణం పూర్తయితే రైతులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా మేలు జరుగుతుంది. ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందుతుంది. సాగుకు ఢోకా ఉండదు.

-పి.రామారావు, రైతు, విక్రాంపురం

కష్టాలు తీరుతాయి..

జంఝావతి ప్రాజెక్టు నిర్మాణం కోసం నాయకులు కృషి చేయాలి. ఒడిశాతో వివాదాన్ని పరిష్కరించాలి. దీనిపై ఒడిశా, ఆంధ్ర ప్రభుత్వాలతో పాటు పాటు కేంద్రం కూడా స్పందించాలి. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే కురుపాం, పార్వతీపురం నియోజకవర్గాల ప్రజలకు తాగు, సాగునీటి కష్టాలు తీరుతాయి.

-వి.రమేష్‌బాబు, రైతు, కొమరాడ



గాలులకు భామిని సమీపంలో కూలిన చెట్టు కొమ్మలు

ఈదురుగాలులతో వర్షం

కొమరాడ/భామిని, జూన్ 15: జిల్లాలో పలుచోట్ల శనివారం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకూ ఎండ తీవ్రత, ఉక్కపోత అధికంగా ఉండగా.. ఆ తర్వాత వాతావరణం మారింది. ఆకాశం మేఘావృతమై.. కొమరాడ తదితర ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. భామిని మండలంలో ఉరుములు, మెరుపులతో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. పసుకుడి, నేరడి, సింగిడి, నులకజోడులో చెట్టుకొమ్మలు నేలకూలాయి. బురుజోల ప్రాథమిక పాఠశాల రేకులషెడ్ పైకప్పు ఎగిరిపోయింది. మరోవైపు పిడుగులతో ప్రజలు భయాందోళన చెందారు. కొన్నిచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఏదేమైనా రెండు రోజులుగా సాయంత్రం వేళల్లో వర్షం కురవడంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. దీంతో జిల్లావాసులు ఎండ తీవ్రత నుంచి కాస్త ఊరట చెందుతున్నారు. ఇకపోతే రైతులు ఖరీఫ్ పనులు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. పత్తి, వరి ఎదలు జల్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

స్పందన పేరు మార్పు

- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థగా కొనసాగించాలని ఉత్తర్వులు

పార్వతీపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి సోమవారం సర్కారీ కార్యాలయాల్లో నిర్వహించిన స్పందన కార్యక్రమం పేరును రాష్ట్ర ప్రభుత్వం తొలగించింది. ఇకపై ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థగా కొనసాగించాలని శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ సిస్టమ్ పేరిట ప్రజల నుంచి వినతి పత్రాల స్వీకరించాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేసింది. వాస్తవంగా గత టీడీపీ ప్రభుత్వ కాలంలో గ్రీవెన్స్ పేరిట ప్రతి సోమవారం అధికారులు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించేవారు. త్వరితగతిన వారి సమస్యలు పరిష్కరించేవారు. దీంతో గ్రీవెన్స్‌కు విశేష స్పందన లభించేది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్పందన పేరుతో అర్జీలు స్వీకరించినా సమస్యల పరిష్కారం అంతంతమాత్రమేనని చెప్పొచ్చు. కాగా ఎన్నికల కోడ్ ప్రారంభమైన తర్వాత ఈ కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రస్తుతం కోడ్‌ను ఎత్తివేయగా.. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం కూడా అధికారంలోకి రావడంతో తిరిగి గ్రీవెన్స్ నిర్వహించేందుకు సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు స్పందన పేరును మారుస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇకపై జిల్లాలో కలెక్టరేట్‌తో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పేరుతో వినతులు స్వీకరించనున్నారు.

వ్యాధుల పంజా

- గ్రామాల్లో మలేరియా, డయేరియా విజృంభణ
- చినమేరంగి సీహెచ్‌సీలో రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు
- ఆందోళనలో పల్లెవాసులు
- వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని విన్నపం

జియ్యమ్మవలస, జూన్ 15 : జియ్యమ్మవలస మండలంలోని పలు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో వాటి తీవ్రత ఎక్కువగా ఉంది. రోజురోజుకూ మలేరియా, డయేరియా వ్యాధిగ్రస్థులు పెరుగుతున్నారు. దీంతో పల్లెవాసుల్లో ఆందోళన నెలకొంది. ఇంటికి ఒకరిద్దరు చొప్పున వ్యాధిగ్రస్థులు ఉన్నారు. ఇప్పటికే అనేక మంది చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. అయితే ఆసుపత్రిలో బెడ్లు చాలకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరికొందరు మెరుగైన వైద్య సేవల కోసం జిల్లా కేంద్రాసుపత్రికి తరలిపోతున్నారు. కాగా తూర్పు ఏజెన్సీ ప్రాంతంలో అర్నాడ, పీటీ మండ, టీకే జమ్ము, అలమండ, కొండ చిలకాం పంచాయతీల నుంచి గత రెండు రోజుల్లో దాదాపు 30 మంది చినమేరంగి సీహెచ్‌సీలో చేరారు. మండంగి శస్విత (కొత్తవలస), జోగి దొర (వనజ), కోమటిపల్లి హేమంత్ (అర్నాడ), కొండగొర్రి సేమ్‌సన్ (వనజ), ఆరిక హైమావతి (వనజ), పి.సుమలత (వనజ), కె.సౌజన్య (వనజ), బిడ్డిక పూజశ్రీ (కొత్తవలస) తదితరులు అక్కడ చికిత్స పొందుతున్నారు. ఆ బాధితుల్లో 10 నెలల చిన్నారి మెల్లక నిరీక్షణ కూడా ఉంది. టీకే జమ్ము పంచాయతీ పాండ్రసింగి గ్రామం నుంచి 13 మంది, చినదోడిజ, చినతోలుమండగూడ, చింత మానుగూడ, గొర్లి, తదితర గిరిజన గ్రామాల నుంచి నలుగురు, కొత్తవలసకి చెందిన మరో నలుగురు గిరిజనులు మలేరియాతో ఇదే సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు.



మలేరియాతో సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న పది నెలల చిన్నారి

డయేరియాతో ఇద్దరు..

అలమండ పంచాయతీ అప్పన్నదొరవలస గ్రామానికి చెందిన ఒక మహిళ, కొండచిలకాం పంచాయతీ కిడిగేసుకి చెందిన శ్రీరాములు అనే వృద్ధుడు డయేరియాతో చినమేరంగి సీహెచ్‌సీలోనే చికిత్స పొందుతున్నారు. ఇందులో అప్పన్నదొరవలస గ్రామానికి చెందిన మహిళ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్య సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికైనా వైద్యాధికారులు, సిబ్బంది, పంచాయతీ అధికారులు అప్రమత్తం కాకుంటే వ్యాధిగ్రస్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. తక్షణమే గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధులను అదుపులోకి తేవాలని ఆయా ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు. పారిశుధ్యం, తాగునీటిపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.



చినమేరంగి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న మలేరియా బాధితులు

విలక్షణ కెరీర్‌కు వీలుకల్పించే
లెదర్ టెక్నాలజీ

మనం పెట్టుకునే బెల్ట్, ఉపయోగించే బ్యాగ్, వేసుకునే చెప్పులు చాలావరకు తోలు ఉత్పత్తులు. జాగ్రత్తగా వినియోగించుకుంటే చాలా కాలం మన్నిక కలిగి ఉంటాయి. నిజానికి ఒక జంతువుకు సంబంధించిన తోలు లేదంటే చర్మం మూడు రోజులకే కుళ్ళిపోయి నాశనమవుతుంది, వాసన వస్తుంది. దాన్ని అలా కానివ్వకుండా రసాయనాలు/ వెజిటబుల్ మెటీరియల్‌తో సంరక్షించి, ఉత్పత్తికి అనువైనదిగా మార్చడం మొదలుకుని తుది ఉత్పత్తి వరకు యావత్తు వ్యవహారాలపై అవగాహన కలిగించేదే లెదర్ టెక్నాలజీ. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి హైదరాబాద్‌లోని 'గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ'లో మాత్రమే సంబంధిత కోర్సులు ఉన్నాయి.



పాలిటెక్నిక్ డిప్లొమాలు

తెలంగాణ - హైదరాబాద్‌లో మాత్రమే గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ ఉంది. మెహదీపట్నం నుంచి గచ్చిబౌలి వెళ్లే దారిలోని రాయదర్గ వద్ద దీన్ని 1980లో ఏర్పాటు చేశారు. ఏఐసీటీఈ ఆమోదంతో స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్‌కు అనుబంధంగా ఆరంభమైంది. ప్రస్తుతం ఈ కాలేజీ రెండు డిప్లొమా కోర్సులను ఆఫర్ చేస్తోంది.

- లెదర్ గూడ్స్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ
- లెదర్ గూడ్స్ అండ్ ఫుట్‌వేర్ టెక్నాలజీ

ఒక్కో కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో మాదిరిగా మూడు యూనివర్సిటీల కోటా అమలవుతుంది. ఎస్ఎస్‌సీ(టెన్త్) ఉత్తీర్ణులు ఇందులో చేసేందుకు అర్హులు. ఈ కోర్సులో చేరేందుకు గరిష్ఠ వయోపరిమితి అంటూ ఏమీ లేదు. 'టీఎస్ పాలిసెట్'లో సాధించిన ర్యాంక్ ఆధారంగా సీటు లభిస్తుంది. ఈ రెండు కోర్సుల బోధనకు అవసరమైన సదుపాయాలన్నీ ఉన్నాయి. ఫుట్‌వేర్ ఫ్యాషన్ స్టూడియో, స్మార్ట్ తరగతి గదులు, అర్హతలకు తోడు అనుభవం ఉన్న ఫ్యాకల్టీ, డిజిటల్ లైబ్రరీ, ఈ బుక్స్, ఈ క్లాస్ రూమ్స్, కంప్యూటర్ ల్యాబ్స్, ఆధునిక ల్యాబ్స్ - మెషినరీ, బాలురకు హాస్టల్ సదుపాయం కూడా ఉంది.

- కోర్సు కాలవ్యవధి ఆరు సెమిస్టర్లు/మూడేళ్ళు. మొదటి అయిదు సెమిస్టర్లూ కాలేజీలోనే థియరీ, ప్రాక్టికల్స్ ఉంటాయి. ఈ కోర్సులో లెదర్‌కు సంబంధించి డిజైన్, ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్ కొత్తగా మెటీరియల్ టెక్నిక్‌ను బోధిస్తారు. ముడిపదార్థంగా తోలుతో మొదలు పెట్టి ఫినిషింగ్ ప్రొడక్ట్ వరకు ప్రతి అంశాన్నీ థియరీలో భాగంగా చెబుతారు. చర్మం లేదా తోలుకు రంగు, మందం అలాగే విలువ పెంచడానికి అవసరమైన అన్ని వ్యవహారాలను ఈ కోర్సులో చేరిన విద్యార్థులు చదువుకోవాలి. ఆరో సెమిస్టర్ అంటే చివరి ఆరునెలలూ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. పూర్తిగా ఇండస్ట్రియల్ ట్రైనింగ్ కోసం ఈ ఆరు నెలలు కేటాయించారు. ఈ సమయంలోనే ప్రాక్టికల్, కమ్యూనికేషన్ నైపుణ్యాలు అలవడతాయి. ఇండస్ట్రీ రెడీగా విద్యార్థులు తయారవుతారు. ఇంటర్న్‌షిప్ సమయంలో ఉచిత వసతికి తోడు విద్యార్థులకు ఉన్న నైపుణ్యాలనుబట్టి నెలకు స్టయిపెండ్‌గా లభిస్తుంది.
- దేశీయంగా బాటా వంటి కంపెనీలకు తోడు టాటా ఇంటర్నేషనల్ ఎక్స్‌పోర్ట్ డివిజన్, ఆడిడాస్, రీబాక్, నైక్, హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్(ఎక్స్‌పోర్ట్ డివిజన్), ఫరీదా ఎక్స్‌పోర్ట్స్, ఫ్లోరెన్స్ ఎక్స్‌పోర్ట్స్‌లో ఈ డిప్లొమా హోల్డర్లకు జాబ్స్ లభిస్తున్నాయి. ఫుట్‌వేర్ డిజైనింగ్, లెదర్ గూడ్స్ డిజైనింగ్, ప్రొడక్షన్ ఆఫ్ ఫుట్‌వేర్, ప్రొడక్షన్ ఆఫ్ లెదర్ గూడ్స్ ప్రొడక్షన్/టానింగ్ ఆఫ్ లెదర్, టెస్టింగ్ అండ్ క్వాలిటీ కంట్రోల్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాల్లో ఉపాధి లభిస్తుంది. మూడు నుంచి అయిదేళ్ళ అనుభవంతో ఆంత్రప్రెన్యూర్లుగానూ మారవచ్చు. సొంతంగా యూనిట్ పెట్టుకోవచ్చు. డిప్లొమాతోనే కొందరు విద్యార్థులు విదేశాల్లోని బహుళ జాతి సంస్థల్లో చేరుతున్నారు. ముఖ్యంగా చైనా, దక్షిణాఫ్రికా, బ్రెజిల్ వంటి దేశాల్లో ఉపాధి పొందుతున్నారు.
- డిమాండ్ అధికంగా ఉండటంతో కొందరు డిప్లొమా పూర్తి చేయకున్నప్పటికీ, కేవలం వ్యక్తిగత సంబంధాలతో కొద్దిపాటి జ్ఞానంతోనే జాబ్స్ పొందుతుండటం విశేషం.

ఉన్నత చదువులు: లెదర్ టెక్నాలజీలో డిప్లొమాతోనే చదువు ఆపేయనవసరం లేదు. ఈసెట్ రాసి లేటరల్ ఎంట్రీ కింద బీఈ/బీటెక్ రెండో ఏడాది కోర్సులో చేరవచ్చు. లెదర్ టెక్నాలజీ, మెకానికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఐటీ, సీఎస్ఈ చేయవచ్చు.

దిక్సూచి DIKSUCHI

సింగరేణిలో
మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

ఖాళీలు 272

జాబ్ కార్నర్

కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్... వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- ఎగ్జిక్యూటివ్ క్యాడర్ పోస్టులు

1. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(మైనింగ్), ఈ2 గ్రేడ్: **139**
2. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఎఫ్ అండ్ ఎ), ఈ2 గ్రేడ్: **22**
3. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(పర్సనల్), ఈ2 గ్రేడ్: **22**
4. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఐఈ), ఈ2 గ్రేడ్: **10**
5. జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్: **10**
6. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(హైడ్రో- జియాలజిస్ట్), ఈ2 గ్రేడ్: **2**
7. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(సివిల్), ఈ2 గ్రేడ్: **18**
8. జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్: **3**
9. జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, ఈ3 గ్రేడ్: **30**

- నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టులు

10. సబ్-ఓవర్సీస్ ట్రెయినీ(సివిల్), టిఅండ్ ఎస్ గ్రేడ్-సి: 16

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/బీఎస్సీ(ఇంజనీరింగ్), సీఏ/ఐసీడబ్ల్యూఏఐ/సీఎంఏ, డిగ్రీ, పీజీ డిప్లొమా, ఎంబీఏ, ఎమ్మెస్సీ, ఎంబీబీఎస్, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: గరిష్ఠంగా 30 ఏళ్లు మించకూడదు. జీడీఎంఓ పోస్టులకు 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల వయో సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రిక్రూట్‌మెంట్ టెస్ట్(ఆబ్జెక్టివ్ టైప్), సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 19

వెబ్‌సైట్: scclmines.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/UI6jhodలో చదవండి.

వర్కింగ్ స్టిల్‌తో ఉస్తాద్



పవన్‌కల్యాణ్; డైరెక్టర్ హరీశ్ శంకర్ కలయికలో తెరకెక్కుతున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. శ్రీలీల ఇందులో కథానాయికగా నటిస్తున్నారు. శనివారం డైరెక్టర్ హరీశ్ శంకర్ ఈ సినిమా వర్కింగ్ స్టిల్‌ను విడుదల చేశారు.

మొక్కు తీర్చుకున్న సాయితేజ్

తన మేనమామ పవన్‌కల్యాణ్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన సందర్భంగా హీరో సాయిదుర్గాతేజ్ తిరుమల వెళ్లి శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. సాయిదుర్గాతేజ్, అల్లు అర్జున్‌ను అన్‌ఫాలో చేసిన విషయం తనకు తెలియదని ఇటీవల జరిగిన ఓ మీడియా సమావేశంలో నిహారిక కొణిదెల అన్నారు



పవన్‌కు బహుమతి

పిఠాపురం ఎమ్మెల్యేగా గెలిచి.. ఇటీవలే ఉప ముఖ్యమంత్రి హోదానూ దక్కించుకున్నారు పవన్‌కల్యాణ్. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక ఆయన తన అన్నయ్య చిరంజీవి ఇంటికి వెళ్లారు. అక్కడ చిరంజీవి సతీమణి సురేఖ పవన్‌కు విలువైన మాంట్‌బ్లాంక్ పెన్నును బహుమతిగా ఇచ్చారు. "తెలుగు ప్రజల ఆకాంక్షల్ని నెరవేరుస్తావని ఆశిస్తూ.. ఆశీర్వదిస్తున్నాం" అని చిరంజీవి, సురేఖ అన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి, సురేఖ, అన్నా లెజినోవా, పవన్ కలసి ఫొటో దిగారు.

'గరం గరం'




నాని సరికొత్త పాత్రలో నటిస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం'. ప్రియాంక మోహన్ హీరోయిన్. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ఆగస్టు 29న సినిమా విడుదలవుతోంది. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేశారు. 'గరం గరం' అంటూ సాగే ఈ పాటను విశాల్ దద్లానీ ఆలపించారు. సహపతి భరద్వాజ్ లిరిక్స్ అందించగా, జేక్స్ బిజోయ్ సంగీతం అందించారు.

'భైరవ యాంథమ్'



ప్రభాస్ నటిస్తున్న 'కల్కి 2898 ఏ.డీ' నుంచి ఓ ప్రోమో సాంగ్ విడుదలైంది. 'భైరవ యాంథమ్' అని సాగే ఈ పాటను భారతదేశపు అతిపెద్ద పాటగా మేకర్స్ తెలిపారు. 21 సెకండ్స్ పాటూ సాగిన ఈ ప్రోమో సాంగ్‌ను పంజాబీ సింగర్ దిల్జీత్ దోసాంజే ఆలపించారు. పూర్తి పాటను నేడు విడుదల చేయనున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సి.అశ్వనీదత్ నిర్మిస్తున్నారు. ఈనెల 27న విడుదలవుతోంది. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. దీపికా పదుకొనే, దిశాపటాని కథానాయికలు.

ఆగస్టులో ఇస్మార్ట్



రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. ఇది 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. హీరోయిన్‌గా కావ్య థాపర్ నటిస్తున్నారు. సంజయ్‌దత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. పూరి కనెక్ట్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మి కౌర్ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: సామ్ కె నాయుడు, జియాని జియాన్నెలి, సంగీతం: మణిశర్మ.

మంత్రి కోమటిరెడ్డి చేతుల మీదుగా...



సదన్ హీరోగా పరిచయమౌతున్న చిత్రం 'ప్రణయ గోదారి'. ప్రియాంక ప్రసాద్ హీరోయిన్. పి.ఎల్.విఘ్నేశ్ దర్శకత్వం వహిస్తున్నారు, పారమళ్ళ లింగయ్య నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ "ఇటువంటి ఫీల్ గుడ్ చిత్రాలు తీస్తున్నందుకు చిత్రబృందాన్ని అభినందిస్తున్నాను. ఈ మూవీ టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్" అని చెప్పారు. ఈ చిత్రానికి డీఓపీ: ఈదర ప్రసాద్, సంగీతం: మార్కండేయ.

ఈ విజయం ఎంతో ఆనందాన్నిస్తోంది



సుధీర్‌బాబు నటించిన లేటెస్ట్ చిత్రం 'హరోంహర'. మాళవిక శర్మ ఇందులో హీరోయిన్‌గా నటించారు. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలై హిట్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు సుబ్రమణ్యం.జి, సుమంత్ నాయుడు.జి మీడియాతో ముచ్చటించారు. "ఈ సినిమా కథ వినగానే తండ్రీ కొడుకుల సెంటిమెంట్, కథానాయకుడి పాత్ర నన్ను బాగా ఆకర్షించాయి. వెంటనే సినిమాను నిర్మించడానికి ఒప్పుకున్నా. ఈ సినిమా విజయం ఎంతో ఆనందాన్నిస్తోంది. విడుదలైన అన్ని చోట్లా థియేటర్లు నిండిపోవడం చూసి ఎంతో ఆనందంగా ఉంది. మంచి సినిమా తీశామని ప్రేక్షకులు, మిత్రులు, ఇండస్ట్రీ పెద్దలు ఫోన్లు చేసి అభినందిస్తున్నారు. ప్రస్తుతం మూడు నాలుగు చిత్రాలు నిర్మిస్తున్నాం. వాటి గురించి త్వరలోనే అధికారిక ప్రకటన చేస్తాము" అని చెప్పారు.

నవ్య 'దృశ్యం' పేజీలో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/PySH7NE లో చదవండి.

ప్రేక్షకులు షాక్ అవుతారు



'నా జీవితంలో మరిచిపోలేని సినిమా 'ఏ'. 26 ఏళ్ల క్రితం ఈ సినిమా విడుదలవుతున్నప్పుడు ఎంత ఉత్సాహంగా ఉన్నానో, ఇప్పుడూ అదే ఉత్సాహంతో ఉన్నాను. ఈ నెల 21న ఈ చిత్రాన్ని తెలుగులో రీ రిలీజ్ చేస్తున్నాం. థియేటర్లలో 'ఏ' సినిమాను చూసి ఇప్పటి ప్రేక్షకులు షాక్ అవుతారు' అని కన్నడ హీరో ఉపేంద్ర అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'ఏ' చిత్రాన్ని నిర్మాత లింగం యాదవ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ శనివారం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో ఉపేంద్ర పాల్గొన్నారు.

ఇక రాజకీయాల జోలికి వెళ్లను



ఇక నుంచి తాను రాజకీయ ప్రేరేపిత కథాంశాలతో సినిమాలు చేయనని దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ చెప్పారు. గతంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల చుట్టూ అల్లుకున్న వివాదాస్పద అంశాలతో పలు సినిమాలు చేస్తూ వార్తల్లో నిలిచారు వర్మ. ఇప్పుడు ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ఆయన తోక ముడిచినట్లు కనిపిస్తోంది. తన సినిమా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. రాజకీయాలపై సినిమాలు చేయడం మానుకుంటున్నాను. ఇక నుంచి దేవుళ్లపై సినిమాలు చేస్తాను అని చెప్పారు.

అన్ని చోట్లా ఆదరిస్తున్నారు



కన్నడ హీరో యశ్ నటించిన ఓ చిత్రం తెలుగులో 'రాజధాని రౌడీ' పేరుతో విడుదలై చక్కటి ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ఆదివారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత సంతోష్ కుమార్ మాట్లాడుతూ 'మా 'రాజధాని రౌడీ' చిత్రాన్ని 94 కేంద్రాల్లో విడుదల చేశాం. అన్ని చోట్లా మంచి వసూళ్లు వస్తున్నాయి. ప్రేక్షకులకు ధన్యవాదాలు' అన్నారు.


చికిత్స పొందుతూ ఒకరి మృతి

భామిని: మండలంలోని బిల్లుమడ గ్రామానికి చెందిన గంగాధర్ పద్మనాభం (59) శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు కథనం మేరకు.. గంగాధర్ బిల్లుమడ సెంటర్‌లో భార్య పార్వతితో కలిసి హోటల్‌ను నిర్వహిస్తుండేవాడు. శుక్రవారం ఉదయం వేకువజామున హోటల్‌కు చేరుకున్నాడు. ఉదయం ఆరు గంటల వరకు భార్య రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆ సమయంలో ఇద్దరికి వాగ్వాదం జరిగింది. అనంతరం ఉదయం 10 గంటలకు హోటల్ మూసివేయగా, భార్య ఇంటికి వెళ్లిపోయింది. గంగాధర్ బిల్లుమడ సమీపంలో తాటిమాను చెరువు వద్ద పురుగుల మందును సేవించి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు గమనించి సమాచారం ఇవ్వడంతో వెంటనే శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. భార్య పార్వతి ఇచ్చిన వాంగూల్మం మేరకు బత్తిలి ఏఎస్ఐ కాంతారావు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహానికి అప్పగించారు. ఏఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మక్కువలో ఒకరు..

మక్కువ: మండలంలోని వెంకట భైరిపురానికి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. వెంకట భైరిపురం గ్రామానికి చెందిన మరడ ఈశ్వరరావు (37) మద్యానికి బానిసై భార్య, పిల్లలను పట్టించుకోకుండా తరచూ డబ్బులు ఇవ్వాలని అడిగేవాడు. లేకపోతే చస్తానని బెదిరించేవాడు. ఈనెల 8న డబ్బులు ఇవ్వాలని భార్యను కోరాడు.లేవని చెప్పడంతో మధ్యాహ్నం నాలుగు గంటల సమయంలో గడ్డి మందు తాగడంతో కుటుంబ సభ్యులు గమనించి మక్కువ పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం శ్రీకాకుళం తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఈశ్వరరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నరసింహమూర్తి తెలిపారు.

విద్యుదాఘాతంతో కూలీ..


అప్పలనాయుడు (ఫైల్)

నెల్లిమర్ల: మండలంలోని అలుగోలులో విద్యుదాఘాతంతో ఓ రైతు కూలీ మృతి చెందాడు. గ్రామానికి చెందిన రైతు కూలి కెల్ల అప్పలనాయుడు ఆవులకు పాలు తీసేందుకు శనివారం వేకువజామున పొలానికి వెళ్లాడు. శుక్రవారం వీచిన గాలులకు దారిలో పడిఉన్న విద్యుత్ తీగలకు తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. అప్పలనాయుడు కుమారుడు కెల్ల రమణ ఇచ్చిన ఫిర్యాదుకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామగణేష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించారు.

రైలు పట్టాలపై మృతదేహం


మృతి చెందిన వ్యక్తి

కొత్తవలస: మండలంలోని నిమ్మలపాలెం రైల్వే బ్రిడ్జి కింద గుర్తు తెలియని మృతదేహాన్ని గ్రామస్థులు కనుగొన్నారు. గ్రామానికి చెందిన కొంతమంది యువకులు శనివారం సాయంత్రం పట్టాలు వైపు వెళ్లగా విజయనగరానికి కొత్తగా వేసిన మూడో లైన్‌పై సుమారు 50ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహం ఉన్నట్టు గుర్తించి రైల్వే సిబ్బందికి సమాచారం అందించారు. తెలియ చేశారు. మృతి చెందిన వ్యక్తి ఎవరనే విషయం తెలియ రాలేదు. రైలు ఢీకొని మృతి చెందాడా? రైలు కింద పడి మృతి చెందాడ అనేది తెలియరాలేదు. ఈ ఘటనపై రైల్వే పోలీసులకు సమాచారం అందించారు.

సంతపాలెంలో అగ్నిప్రమాదం

కొత్తవలస: మండలంలోని సంతపాలెం గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో గొటివాడ పొట్టి అప్పారావుతో సహా మరో మూడు ఇళ్లు కాలిపోయాయి. విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగానే ఈప్రమాదం జరిగిఉంటుందని కొత్తవలస అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు హుటాహుటిన వెళ్లి మంటలను అదుపు చేసినట్లు చెప్పారు. సుమారు రూ.1.40 లక్షల వరకు నష్టం జరిగి ఉంటుందని అంచనా వేసినట్టు తెలిపారు.

బాధితులకు అండగా ఉంటాం

సంతపాలెం అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉంటామని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, శృంగవరపుకోట శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి అన్నారు. బాధిత కుటుంబాలను శనివారం పరామర్శించారు. బాధితులను ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే సీజ్

విజయనగరం క్రైం: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే సీజ్ చేస్తామని విజయనగరం రూరల్ ఎస్ఐ వాసుదేవ్ హెచ్చరించారు. శుక్రవారం రాత్రి రూరల్ పరిధిలోని వై జంక్షన్, వీటీ అగ్రహారం ప్రాంతాల్లో విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇస్తే యాజమానులపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలతో పాటు, లైసెన్సు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జంతు సంక్షేమ చట్టాలను ఉల్లంఘిస్తే చర్యలు

విజయనగరం రింగురోడ్డు: ఈ నెల 17న నిర్వహించే బక్రీద్ పండుగ రోజున జిల్లాలో అక్రమంగా పశువధ, అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు చేపడతామని జిల్లా పశు సంవర్ధకశాఖాధికారి డాక్టర్ ఎ.విశ్వేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా జంతు సంక్షేమ చట్టాలను పాటించాలని స్పష్టం చేశారు. దీనిపై జిల్లాలోని పశు సంవర్ధక శాఖాధికారులు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు దృష్టి సారించాలని సూచించారు.

రూ.10 లక్షల బీమా అందజేత


బీమా చెక్కును అందజేస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్

విజయనగరం రింగురోడ్డు: తపాలాశాఖ అనుబంధ సంస్థ ఇండియా పోస్టు పేమేంట్స్ బ్యాంకు గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీ కింద ప్రమాద బీమా పరిహారం రూ.10 లక్షల చెక్కును శనివారం పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ బాధిత కుటుంబానికి అందజేశారు. మహారాజా కోట వెనుక ప్రధాన తపాలా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రమాద బీఈమా తీసుకోవాలని సూచించారు. ఏసీ మరమ్మతులు చేస్తున్న వర్కర్ యలమంచిలి శ్రీను విద్యుత్‌షాక్ తగిలి ప్రమాదంతో మరణించడం వల్ల నామినీ అయిన భార్యకు రూ.10 లక్షలు ప్రమాద బీమా అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ సబ్‌డివిజన్ అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ సుందరనాయుడు, ఇండియా పోస్టు పేమేంట్స్ బ్యాంకు మేనేజరు సతీష్, బజాజ్ ఎలియన్స్ జనరల్ ఇన్సూరెన్స్ జోనల్ మేనేజర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై కదిలిన రెవెన్యూ యంత్రాంగం


వావిలపాడు వద్ద చెరువు గట్టుపై నిర్మించిన రోడ్డును పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శృంగవరపుకోట/వేపాడ: భూ ఆక్రమణలపై చర్యలు తీసుకునేందుకు రెవెన్యూ అధికారులు కదిలారు. 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన ఇకనైన ఇటు చూడండి అనే కథనంపై వారు స్పందించారు. వేపాడ మండలం వావిలపాడు చెరువు గట్టును రోడ్డుగా మార్చిన స్థలాన్ని తహసీల్దార్ బి.సత్యం, ఉపతహసీల్దార్ కొల్లి సన్యాసినాయుడు, ఆర్ఐ రామలక్ష్మి, సర్వేయర్ అప్పలనాయుడు పరిశీలించారు. గట్టు పూర్వస్థితికి తీసుకురావాలని సాగునీటి శాఖ అధికారులకు సూచించారు. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శృంగవరపుకోట మండల పరిధిలో భూ ఆక్రమణలకు పాల్పడిన వారందరికీ నోటీసులు జారీ చేస్తామని ఉపతహసీల్దార్ తెలిపారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

రైతుల పక్షపాతి చంద్రబాబు

● ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

రాజాం, జూన్ 15: రైతుల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు అని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. శనివారం శ్యాంపురం గ్రామంలో రైతులకు రాయితీపై వరి విత్తనాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు అంటే చంద్రబాబుకు ఎంతో అభిమానమని తెలిపారు. వారికి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అన్నదాత పథకం ద్వారా రైతులకు ఏటా రూ.20వేలు అందజేస్తామన్నారు. గత ప్రభుత్వ పాలనలో అన్నదాతలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయార న్నారు. జగన్ తన సమయాన్ని ప్రతిపక్షాల వేధింపులకే పరిమితం చేశారని విమర్శించారు. ఇసుక, మద్యం దోపిడీపై పెట్టిన శ్రద్ధ అన్నపెట్టే రైతులపై పెట్టలేకపోయారన్నారు. ఒక్క చాన్స్‌తో ఎక్కువ నష్టపోయింది రైతులే అన్నారు. మోటార్లకు మీటర్లు పెట్టి రైతుల మెడకు ఉరితాడు బిగించాడని ఆరోపించారు. రూ.3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి, రూ.4వేల కోట్లతో ప్రకృతి విపత్తుల నిధి ఏర్పాటు చేస్తామని మోసం చేశారన్నాడు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు 4 వేల మంది అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడినట్లు రైతుస్వరాజ్ నివేదిక స్పష్టం చేసిందని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటను చంద్రబాబునాయుడు నిలబెట్టుకొని ఐదు హామీలకు సంబంధించి సంతకం చేశారని తెలిపారు. అధికారులు, నాయకులు కోండ్రుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసచక్రవర్తి, సీఐలు ఎస్.శ్రీనివాసరావు, డి.మోహన్‌రావు, సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ కరణం హరిబాబు, ఏడీ చంద్రరావు, ఏవో ఎం.రేణుకాసాయి, నాయకులు నంది సూర్యప్రకాష్‌రావు, వంగా వెంకటరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, శాసపు రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం

రాజాం పురపాలక సంఘం పరిధిలోని 17వ వార్డులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి శనివారం పాలభిషేకం చేశారు. మెగా డీఎస్సీ, పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్ రద్దు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, స్కిల్ సెన్సెస్ ఫైళ్లపై చంద్రబాబు సంతకాలు చేయడంతో వార్డు ప్రజలు సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అమ్మవారు కాలనీ, ఆదర్శనగర్ కాలనీ, టీచర్సు కాలనీ, నవ్యనగర్ కాలనీ మహిళలు, వార్డు ఇన్‌చార్జి పెంకి గౌరీశ్వర రావు, దన్నాన శ్రీను, పెంకి చైతన్యకుమార్. దన్నాన లక్ష్మణ్, దంగుడుబియ్యం శ్రీనివాసరావు, దువ్వారాం గోపాలం, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.


చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న దృశ్యం

అమలులోకి చంద్రబాబు హామీలు: నాగార్జున

విజయనగరం రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పాలన మొదలైందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన తొలి రోజే ఆయన ఐదు సంతకాలు చేశారన్నారు. సామాజిక పింఛన్లను రూ.4 వేలకు పెంచారని, దీని వల్ల లబ్ధిఆరులు ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. మెగా డీఎస్సీతోఓ 16 వేల పోస్టులను ఒకేసారి భర్తీ చేయడమన్నది ఎంతో గొప్ప విషయమన్నారు. ఇక ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు, అన్నక్యాంటీన్లు రాష్ట్ర వ్యాప్తంగా తెరుచుకునేందుకు మార్గం సుగమమవడం శుభ పరిణామమని చెప్పారు. రానున్న కాలంలో మరిన్ని కార్యక్రమాలు, హామీలు నెరవేర్చే దిశగా చంద్రబాబు ముందుకు సాగుతున్నారని కొనియాడారు.


కొబ్బరికాయలు కొడుతున్న దృశ్యం


రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న కోండ్రు మురళీమోహన్

కల్యాణ వేంకటేశ్వరునికి నారికేళాలు

నగరంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన్ జాతీయ ఉపాధ్యక్షులు జంధ్యాల బుచ్చిబాబు ఆధ్వర్యంలో స్వామి వారికి అష్టోత్తర శత నారీకేళాలను శనివారం సమర్పించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఆయన ఈ మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, విజ్ఞపు ప్రసాద్, డాక్టరు పేరి రామయ్య పంతులు, కింగ్ ఆర్ఫ్ రాజు పాల్గొన్నారు..

బేబీనాయనకు అభినందనలు

బొబ్బిలి: బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కెకె రంగారావు (బేబీనాయన)కు శనివారం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన పలు శాఖల అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఎస్ఐలు లోవరాజు, మూర్తి, ఏఎస్ఐ బీవీ రమణతో పాటు ఐసీడీఎస్ పీఓలు, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బొబ్బిలి కోటకు వచ్చి బేబీనాయనకు అభినందనలు చెప్పారు. రామభద్రపురం మండలం పాతరేగ గ్రామానికి చెందిన యూత్ సభ్యులతో పాటు అనేక గ్రామాల నుంచి అభిమానులు తరలివచ్చారు.

ఎమ్మెల్యేని కలిసిన కిరణ్

శృంగవరపుకోట: ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారిని శనివారం ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెక్క కిరణ్‌కుమార్ కుటుంబ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీపీ రామ్‌ప్రసాద్ ఉన్నారు.

పరిశ్రమల మూతకు వైసీపీయే కారణం

● విశాఖ ఎంపీ శ్రీభరత్

కొత్తవలస: రాష్ట్రంలో ఫెర్రోక్రోమ్ పరిశ్రమల మూతకు గత వైసీపీ ప్రభుత్వమే కారణమని విశాఖపట్నం ఎంపీ ఎం.భరత్ అన్నారు. మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీ జిందాల్‌నగర్‌లోని జేఎస్ఎల్ కర్మాగారం ఎదుట కార్మికులు చేపడుతున్న నిరసన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారితో కలిసి ఆయన పరిశీలించారు. కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జేఎస్ఎల్ యాజమాన్యం కనీసం తమకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా లాకౌట్ విధించిందని, లే ఆఫ్ ఇవ్వమని కోరినా పట్టించుకోవడం లేదని కార్మికులు ఏకరవు పెట్టారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఫెర్రోక్రోమ్ పరిశ్రమలకు ఎక్కువగా విద్యుత్ అవసరం ఉంటుందన్నారు. అయితే, గత వైసీపీ ప్రభుత్వం తన స్వార్థ ప్రయోజనాల కోసం విద్యుత్ చార్జీలను పెంచిందన్నారు. యూనిట్ ధరను రూ.7.50కు పెంచిందని, వైసీపీ నేతల జేబుల్లోకి మాముళ్లు రాగానే మళ్లీ యూనిట్ ధర రూ.6.50కు తగ్గించిందన్నారు. విద్యుత్ చార్జీల పెంపుతో ఉత్తరాంధ్రలో సుమారు 15 ఫెర్రోక్రోమ్ పరిశ్రమలు మూత పడ్డాయన్నారు. జేఎస్ఎల్ కర్మాగారాన్ని ముడిసరుకు కొరత కారణంగా లాకౌట్ విధించారా? లేక వేరే కారణాలతో విధించారా? అనే విషయాన్ని యాజమాన్యంతో మాట్లాడుతానని తెలిపారు. ముడిసరుకు కొరత కారణమైతే అందుకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వంతో మాట్లాడి తెరిపించడానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్మికులకు న్యాయం చేయడానికి అన్ని విధాల కృషి చేస్తానని ఎమ్మెల్యే లలితకుమారి చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొరపల్లి రాము, కనకాల శివ, తిక్కాన చినదేముడు, మాకెన సీతారామపాత్రుడు, గొంపకృష్ణ, కార్మిక సంఘాల నాయకులు పిల్లా అప్పలరాజు, కోన దేముడు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్, చిత్రంలో ఎమ్మెల్యే లలితకుమారి

ఆక్రమణలపై న్యాయ పోరాటం

● చెరువుల పరిరక్షణ ఐక్య వేదిక తీర్మానం

బొబ్బిలి: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బొబ్బిలి పట్టణం, మండలంలో జరిగిన చెరువులు, ప్రభుత్వ స్థలాలు, ఇందిరమ్మ కాలనీల ఆక్రమణలపై న్యాయ పోరాటం చేయాలని చెరువుల పరిరక్షణ ఐక్య వేదిక తీర్మానించింది. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ.. ఇందిరమ్మ కాలనీలోని పేదల ఇళ్లు, స్థలాలతో పాటు కోటిచెరువు, భైరిసాగరం, పక్కులబంద, మిలటరీ కాలనీ బంద, జూట్‌మిల్లు బందలు ఆక్రమణకు గురయ్యాయని తెలిపారు. ప్రభుత్వ సొత్తును కబ్జా చేస్తుంటే అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తుందే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఈ ఆక్రమణలు అడ్డుకోవాలని ఆర్డీవో, మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ప్రజాసంఘాలు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎటువంటి ఫలితం లేకుండా పోయిందన్నారు. ప్రజాధనాన్ని కాపాడడంలో విఫలమైన అధికారుల తీరుపై కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం ద్వారా న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నట్లు వేదిక ప్రతినిధులు తెలిపారు. ఇప్పటికైనా ఆక్రమణలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం, సీపీఐ, రైతు సంక్షేమ సంఘం, రైతు సంఘం, ప్రజా సంకల్ప వేదిక నాయకులు పొట్నూరు శంకరరావు, కోట అప్పన్న, వి.లక్ష్మునాయుడు, ఎస్.గోపాలం పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

● ఎమ్మెల్యే బేబీనాయనకు ఏపీటీఎఫ్ వినతి

బొబ్బిలి: గత ఐదేళ్లలో పరిష్కారానికి నోచుకోని అనేక విద్యారంగ సమస్యలపై నూతన ప్రభుత్వం దృష్టిసారించి ఉపాధ్యాయ లోకానికి మేలు చేయాలని ఏపీటీఎఫ్ నేతలు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యే బేబీనాయనను శనివారం సాయంత్రం బొబ్బిలి కోటలో ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు బంకురు జోగినాయుడు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనరు జేసీ రాజు ఆధ్వర్యంలో నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేయాలని, 2003 డీఎస్సీ టీచర్లకు పదిరాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధంగా పాత పెన్షన్ (ఓపీఎస్) అమలు చేయాలని, విద్యారంగం ఉనికికి పెను ప్రమాదంగా తయారైన 117 జీవోను రద్దు చేసి ప్రాథమిక విద్యను పరిరక్షించాలని, మూతపడిన పాఠశాలలను తెరిపించేందుకు కొత్త ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని పాఠశాలల్లో ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానాన్ని ప్రవేశపెట్టాలని, కేజీబీవీ బోధనా సిబ్బందిని ఎలాంటి షరతులు లేకుండా విధుల్లో కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర విధుల నుంచి విముక్తి కలిగించాలని, మెగా డీఎస్సీ నిర్వహించాలని, ఎంటీఎస్ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని కోరారు. పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయ వర్గాల ఆకాంక్షలను నెరవేర్చేవిధంగా విద్యావిధానం, పరిపాలనను చంద్రబాబు చేపడతారని ఆశిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సమస్యలన్నింటినీ ముఖ్యమంత్రి, విద్యాశాఖమంత్రి దృష్టికి తీసుకెళతానని బేబీనాయన వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు బొత్స పద్మావతి, లక్ష్మణరావు, కె.శ్రీను, ఆర్.రామకృష్ణ, ఎస్.ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

ఏపీటీఎఫ్ వేడుకలను విజయవంతం చేయాలి

బొబ్బిలి: ఏపీటీఎఫ్ 80 వసంతాల వేడుకలను విజయ వంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు ఎం.బలరాంనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక ఎంఆర్‌సీ భవనంలో మండలాల ప్రాంతీయ కార్యకర్తల సమావేశంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రానున్న దసరా సెలవుల్లో మూడురోజుల పాటు జిల్లా కేంద్రంలో రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 1944లో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్‌ను ఏర్పాటు చేసి విద్యారంగ ప్రగతికి, ఉపాధ్యాయవర్గాల సమస్యల పరిష్కారానికి అనేక ఉద్యమాలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు దాసరి వెంకటనాయుడు, గంట సత్యనారాయణ, సీహెచ్ రామారావు, భానుప్రకాశ్, కెగోపాలకృష్ణనాయుడు, నాని వాణి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులులేని విద్యాసంస్థలపై చర్యలు చేపట్టాలి

జామి: మండలంలో అనుమతిలేకుండా నడుస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై వెంటనే చర్యలు చేపట్టాలని మండల డీ-పీఆర్‌టీయూ నేతలు కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. జామిలో తిరుమల పబ్లిక్ స్కూల్, ఒక ప్లే స్కూల్‌తో పాటు కుమరాం గ్రామంలో అమర్ అనే పాఠశాలను అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటువంటి స్కూళ్లతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గుతుందన్నారు. వీటిపై విద్యాశాఖ పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఎంఈవో జయశ్రీ వివరణ కోరగా.. మంగళవారం పరిశీలిస్తామని తెలిపారు.

గడిముడిదాంలో వ్యక్తి ఆత్మహత్య

రాజాం రూరల్: మండలంలోని గడిముడిదాం గ్రామానికి చెందిన ముడిదాన గురయ్య (42) అనే వ్యక్తి శనివారం తన ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురయ్య కొన్నేళ్లుగా విశాఖలోని వెంకోజీపాలెంలో కూలి పనులు చేసుకుంటూ భార్య, ఇద్దరు పిల్లలతో జీవిస్తున్నాడు. మేలో జరిగిన ఎన్నికలకు భార్యా పిల్లలతో కలిసి వచ్చాడు. ఓటు వేసిన అనంతరం తిరిగి విశాఖకు వెళ్లిపోయాడు. వారం రోజులు క్రితం గ్రామానికి తిరిగి వచ్చి ఇంట్లో ఒక్కడే ఉంటూ మానసిన వేదనతో జీవనం సాగిస్తున్నాడు. ఈనేపథ్యంలో శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి శివయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవికిరణ్ కేసు నమోదు చేశారు.

వైద్యుల రక్తదానం

రింగురోడ్డు: అసోసియేషన్ సర్జన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం రోటరీ, విజయ బ్లడ్ బ్యాంక్‌లో నగరంలోని ప్రైవేట్ సర్జన్‌వైద్యులు 39 మంది రక్తదానం చేశారు. తిరుమల మెడికవర్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ కె.తిరుమల ప్రసాద్, వైద్యులు కె.రమణి, గోపీనాథ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశ్రీ రచనలు సమాజానికి మేలు కొలుపు

సాలూరు రూరల్: శ్రీశ్రీ రచనలు సమాజానికి మేలు కొలుపని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం.ఉమామహేశ్వరి, సీఐటీయూ నేత ఎన్‌వై నాయుడు అన్నారు. శ్రీశ్రీ 41వ వర్ధంతిని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్‌వై నాయుడు ఆధ్వర్యంలో శనివారం సాలూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీశ్రీ రచనలు అట్టడుగు వర్గాలను జాగృతం చేశాయన్నారు. పీడిత వర్గాల్లో చైతన్య దీపికలను రగిల్చాయన్నారు. సమసమాజ పోరాటానికి ఈ రచనలు దిక్సూచిగా పని చేశాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బంగారమ్మ, శశికళ, జ్యోతిలక్ష్మి, పార్వతి తదితరులు పాల్గొన్నారు. **నెల్లిమర్ల:** కొండగుంపాంలో సీపీఐ మండల కమిటీ కార్యదర్శి మొయిద పాపారావు ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ వర్ధంతి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయుకులు పొట్నూరు సూర్యారావు, బండి సత్యనారాయణ, ఎం.రమణమ్మ పాల్గొన్నారు. **శృంగవరపుకోట:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం శ్రీశ్రీ వర్ధంతి నిర్వ హించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిం చారు. ప్రిన్సిపాల్ కేశవరావు, అధ్యాపకులు షేక్ వలీఖాన్, వి.స్వామి నాయుడు, పి.భాస్కర్ పాల్గొన్నారు.

'అన్న క్యాంటీన్లకు డొక్కా సీతమ్మ పేరుపెట్టాలి'

విజయనగరం దాసన్నపేట: పేదల ఆకలి తీర్చడానికి ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్లకు డొక్కా సీతమ్మ పేరు పెట్టాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఈ మేరకు శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లేఖ రాశారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వివిధ సభల్లో డొక్కా సీతమ్మ క్యాంటీన్లు ప్రారంభిస్తామని హామీ ఇచ్చిన విషయం గుర్తు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సత్యనారాయణ, సుంకరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ అధ్యక్షుడి రాజీనామా

రాజాం రూరల్: రాజాం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) అధ్యక్షుడు వాకముళ్ల చిన్నారావు తన పదవికి శనివారం రాజీనామా చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుతం ఆయన అంతకాపల్లి సర్పంచ్‌గా కొనసాగుతున్నారు.

నేడు తాగునీటి సరఫరా

రాజాం: పురపాలక సంఘం పరిధిలోని అన్ని వార్డులకు ఆదివారం పూర్తి స్థాయిలో తాగునీటిని సరఫరా చేస్తామని కమిషనర్ జె.రామప్పలనాయుడు, ఏఈ వెంకట రామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం వీచిన గాలులకు రేగిడి మంచినీటి పథకం హెడ్ వర్క్స్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. శనివారం ఉదయానికి విద్యుత్ పునరుద్ధరణ జరిగిందని, ఆదివారం నుంచి వార్డుల్లో నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రేపటి నుంచి భజన పోటీలు

సీతానగరం: మండలంలోని లక్ష్మీపురంలో సోమవారం నుంచి ఈనెల 19 వరకు తాళం భజన పోటీలు నిర్వహించనున్నట్లు అయ్యప్ప గురుస్వామి చప్ప వెంకటరమణ, తాళం భజన గురువు కొక్కిర సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం, బొబ్బిలి, సీతానగరం, సాలూరు, మక్కువ, బలిజిపేట, పాచిపెంట, మండలాల నుంచి ఆశక్తి గలవారు భజన పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆదివారంలోగా భజన మండలి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9502833436, 9490460975 నెంబర్‌లకు సంప్రదించాలని కోరారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

రాజాం: పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను పురపాలక సంఘం కమిషనర్ జె.రామప్పలనాయుడు, ఏఈ వెంకటరామరాజు శనివారం పరిశీలించారు. రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా తక్షణం చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేగొండి ప్రసాద్‌ను ఆదేశించారు. అనంతరం వాసవి నగర్‌లో ప్రధాన మురుగు కాలువలను పరిశీలించారు. వారివెంట ఎన్విరాన్మెంట్ ఏఈ భాగ్యలక్ష్మి, సిబ్బంది రాంబాబు, జయరాజు తదితరులు ఉన్నారు.

కలెక్టర్ నాగలక్ష్మికి అభినందనలు

విజయనగరం దాసన్నపేట: జిల్లాలో ఇటీవల సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను జిల్లా యంత్రాంగం సమర్ధవంతంగా నిర్వహించిందని జనసేన పార్టీ జిల్లా నాయకులు మిడతాన రవికుమార్ అన్నారు. శనివారం కలెక్టర్ నాగలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి, అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అప్పలరాజు, పైడిరాజు, బద్రీ తదితరులు పాల్గొన్నారు..

రక్తదానం సామాజిక బాధ్యత

విజయనగరం రింగురోడ్డు: రక్తదానం సామాజిక బాధ్యతని రెడ్‌క్రాస్ కార్యదర్శి కె.సత్యం అన్నారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శనివారం రెడ్‌క్రాస్ భవనంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. గ్రామీణ వైద్యులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ శిబిరంలో సుమారు 25 మంది రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘ జిల్లా అధ్యక్షుడు గద్దె చిరంజీవి, ప్రతినిధులు భవానీ, సీతారామ్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణారావుకు అవార్డు

విజయనగరం రింగురోడు: మయూరి ఆర్ట్స్ వారి ఇండియన్ నేషనల్ ఐకాన్ అవార్డు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రక్తదాత, సామాజికవేత్త బొడ్డేపల్లి రామకృష్ణారావుకు అవార్డును అందజేశారు. రికార్డు స్థాయిలో 183 సార్లు రక్తదానం, సామాజిక సేవా కార్యక్రమాలు చేసినందుకు ఆయనకు అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా డాన్స్ మాస్టర్లు నటరాజ్, సీతూ, ప్లాటినం బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు తెలంగాణ చీఫ్ కో ఆర్డినేటర్ మయూరి రాధ తదితరులు పాల్గొన్నారు.

జీవో-3ని అమల్లోకి తీసుకురావాలి

● ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి అవినాష్‌కుమార్



మాట్లాడుతున్న అవినాష్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: రద్దుచేసిన జీవో నెంబర్-3 రద్దు అమల్లోకి తీసుకురావాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్‌కుమార్, జిల్లా గౌరవాధ్యక్షుడు రమణ కోరారు. శనివారం గుమ్మలక్ష్మీపురం లో విలేకరులతో మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం భాషా వలంటీర్లను రెన్యూవల్ చేయాలని కోరారు. గిరినుల సమస్యలపై జిల్లాకు చెందిన గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, కురుపాం, పాలకొండ ఎమ్మెల్యేలు దృష్టిసారించాని కోరారు. మెగా డీఎస్సీపై ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేయడంపై హర్షం వ్యక్తంచేశారు. సమావేశంలో గిరిజన సంఘం జిల్లా కమిటీ భ్యులు ఎం. శ్రీనివాస రావు, సన్యాసి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదరి కొల్లి గంగునాయుడు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనాన్ని వెనక్కి తీసుకోవాలి

● ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మర్రాపు మహేష్

గరుగుబిల్లి: పాఠశాలల విలీనాన్ని వెనక్కు తీసుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మర్రాపు మహేష్ కోరారు. శనివారం మండలంలోని ఖడ్గవలస మండల పరిషత్ పాఠశాలలో ఏపీటీఎఫ్ మండల సబ్ కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు మర్రాపు మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాటాడుతూ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రాథమిక విద్య తెలుగు మాధ్యమంలో, ఆరో తరగతి నుంచి ఆంగ్లం, తెలుగు మాధ్యమాల్లో బోధన జరిగేలా మార్పులు తీసుకురావాలని కోరారు.ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎ.మహేశ్వరరావు మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం జీవో-117ను రద్దు చేయాలన్నారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు వి.తిరుపతిరావు, ఐవీ రమణ, వి.శ్రీనివాసరావు, డి.రమేష్, ఎస్.మంగయ్య పాల్గొన్నారు.

సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

●మండల పంచాయతీ విస్తరణాధికారి గోపాలరావు



గరుగుబిల్లి: సంతోషపురంలో బావిలో క్లోరినేషన్ చేస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి:ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు హెచ్చరించారు. గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని తెలిపారు. శనివారం మండలంలోని సంతోషపురం, శివ్వాం, కొత్తూరు, పెద్దూరు, కొంకడివరం పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ పనులతో పాటు క్లోరినేషన్ చర్యలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు మురుగు నిల్వలు తొలగించడంతో పాటు క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా నీటిని శుభ్రపరచాలన్నారు. కొళాయిలు, రక్షిత పథ కాలు ప్రాంతాల్లో నాచు,మురుగు నీరు లేకుండా ఎప్పటికప్పుడు తొలగింపు చర్యలు చేపట్టాలన్నారు. కార్య క్రమంలో సర్పంచ్‌లు అంబటి తవిటినాయుడు, రాంబాబు, అల్లు అప్పలనాయుడుతో పాటు వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చినమేరంగిలో పారిశుధ్య పనులు

జియ్యమ్మవలస: మండలంలో చినమేరంగిలో ఎట్టకేలకు పారిశుధ్య పనులు చేపట్టారు. గత ఏడాదిగా ఊసేఎత్తని సర్పంచ్ అల్లు రమణమ్మ ప్రస్తుతం పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి బి.రామకృష్ణ పర్యవేక్షణలో పారిశుధ్య, కాలువల్లో స్ప్రేయింగ్ పనులు జరుగుతున్నాయి. స్ప్రేయింగ్ పనులు ఏఎన్ఎం భవాని, ఆశావర్కర్లు వి.లక్ష్మి, వి.రేణుక, బి.స్వర్ణలు పర్యవేక్షిస్తున్నారు.

ఎన్ఎంయూ సభ్యత్వ నమోదు

పాలకొండ: స్థానిక ఆర్టీసీ డిపోలో ఎన్ఎంయూ సభ్యత్వ నమోదు శనివారం జరిగింది. విజయనగరం జోన్ ఇన్‌చార్జి పి.భానుమూర్తి, బీకేమూర్తి ఆధ్వర్యంలో ఎన్ఎంయూలో చేరిన వారిని అభినందించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ముందు ఉండాలని, ప్రభుత్వానికి సమస్యలను తెలపడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు వెంకటరావు, జి.రవికాంత్, డి.డి.రావు, సాగర్, దామోదర్‌నాయుడు, మజ్జి వెంకట సూర్యనారాయణ, బొడ్డు వెంకటరమణ, సంగందొర, పి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

నేటి నుంచి కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

సాలూరు రూరల్: సాలూరులో వెలసిన భూ, నీలాసమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి పంచదశ వార్షిక బ్రహ్మోత్సవాలను ఆదివారం నుంచి నిర్వహించనున్నట్లు వ్యవస్థాపక ధర్మకర్త వంగపండు రాజేంద్రప్రసాద్ శనివారం తెలిపారు. బ్రహోత్సవాలు ఈ నెల 19 వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. తొలిరోజు అంకురార్పణ, శ్రీవారి వాహన తిరువీధి నిర్వహిస్తామని తెలిపారు. 17న తిరుకల్యాణం, 18న సహస్ర దీపాలంకరణ సేవ, నక్షత్రేష్టి హోమం, చక్రస్నానం, 19న విశేష హోమాలు, సుదర్శన స్నపనోత్సవం, మహాపూర్ణాహుతి, పుష్పయాగం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

సీటీ మండగూడలో వైద్య శిబిరం

జియ్యమ్మవలస: అలమండ పంచాయతీ చినతోలు మండగూడలో రావాడ రామభద్రపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చీకటి శంకరరావు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

నేడు కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీ



విజయోత్సవ ర్యాలీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఉలక

రాయగడ: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 14 శాసనసభ, ఒక లోకసభ స్థానంలో విజయం సాధించింది. బీజేడీ కంచుకోటగా ఉన్న రాయగడ జిల్లాలో మూడు శాసన సభ స్థానాలు, ఒక లోకసభ స్థానంలో గెలుపొందింది. రాష్ట్రంలోని 21 లోక్‌సభ స్థానాలకుగాను బీజేపీ 20 స్థానాల్లో గెలుపొందగా అవిభక్త కోరాపుట్ లోకసభ స్థానంలో సిటింగ్ ఎంపీ సప్తగిరి శంకర ఉలక మరోసారి విజయం సాధించారు. ఈ నేపథ్యంలో ఆదివారం కాంగ్రెస్ శ్రేణులు మజ్జిగౌరి మందిరం నుంచి హోటల్ తేజస్వీ మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు ఎంపీ సప్తగిరి ఉలక నేతృత్వంలో జరగనున్న సభలో 14 మంది శాసనసభ్యులు పాల్గొననున్నారు.

5 టీ బోర్డులు తొలగించాలి

● జిల్లా విద్యాశాఖాధికారి బసంతకుమార్ నాయక్ ఆదేశం

రాయగడ: బిజూ జనతాదళ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 5 టీ ఫ్లకార్డులు, బోర్డులను తొలగించాలని జిల్లా విద్యాశాఖాధికారి బసంతకుమార్ నాయక్ అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీచేశారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పలు నిర్ణయాలను తీసుకున్న విషయం విదితమే. గత ప్రభుత్వం పాఠశాలల్లో 5టి పథకం అమలుకోసం నిధులు కేటాయించింది. జిల్లాలోని 11 సమితుల పరిధిలో ఉన్న 158 పాఠశాలలతో పాటు విద్యాశాఖ కార్యాలయాల్లో ఉన్న 5టి బోర్డులు తక్షణమే తొలగించాలని ఆదేశాలు జారీచేశారు. పాఠశాలలకు సెలవులు కావడంతో తెరిచిన తర్వాత శాఖాపరమైన ఉత్తర్వులను అమలు చేస్తామని అధికారులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

వినియోగంలో లేక.. పడిగాపులు తప్పక

● రోడ్లపై, చెట్ల నీడలో నిరీక్షణ ● ప్రయాణికులకు తప్పని అగచాట్లు ● ఇదీ భామిని మండలంలోని విశ్రాంతి భవనాల పరిస్థితి



బస్సు కోసం రోడ్డుపైనే నిల్చొని ఉన్న ప్రయాణికులు

భామిని: మండలంలోని వివిధ ప్రాంతాల్లో నిర్మించిన విశ్రాంతి భవనాలు నిరుపయోగంగా మారాయి. అంతేకాకుండా ఆక్రమణలకు గురవుతున్నాయి. పెద్దదిమిలి, ఘనసర, భామిని, సింగిడి, గురండి, బత్తిలిలోని విశ్రాంతి భవనాలు ప్రయాణికులకు ఉపయోగపడడంలేదు. దీంతో వారంతా రోడ్లపైన, షాపుల వద్ద బస్సుల కోసం పడిగాపులు కాయక తప్పడం లేదు. భామినిలో రెండు విశ్రాంతి భవనాలు ఉన్నప్పటికీ ఒక్కటీ వినియోగంలో లేదు. రెండేళ్ల క్రితం మన్యం జిల్లా ఆవిర్భావ సమయంలో భామిని మండల కేంద్రంలోని విశ్రాంతి భవనానికి మెరుగులు దిద్దుతామని డిపో మేనేజర్లు పలుమార్లు కొలతలు వేసి వెళ్లారే తప్ప పనులు చేపట్టలేదు. భామిని సెంటర్‌లో పెద్ద మర్రిచెట్టు ఉండడం ప్రయాణికులకు కొంత ఊరటనిచ్చేది. తుపాను వల్ల మర్రిచెట్టు కూలిపోవడంతో నిలువ నీడ లేకుండాపోయింది. పాలకొండ నుంచి బత్తిలి వరకు బస్సులు కూడా ఏడాదిగా తొలగించడంతో ఈ ప్రాంతీయులు రవాణా కష్టాలు ఎదుర్కొంటున్నారు. దీనిపై పాలకొండ డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు వద్ద ప్రస్తావించగా... భామిని విశ్రాంతి భవనానికి మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. బత్తిలి రూట్‌లో సరైన ఆదరణ లేకపోవడంతో బస్సులు నిలుపుదల చేశామన్నారు. ఈ ప్రాంతం నుంచి సీతంపేట ఐటీడీఏ, పాలకొండ ఆర్డీవో కార్యాలయానికి వెళ్లేందుకు బస్సులు మారే పరిస్థితి ప్రయాణికులకు తప్పడం లేదు. ఇప్పటికైనా పాలకొండ, పార్వతీపురం ప్రాంతాలకు బస్సులు నడిపి ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.



భామినిలో చెత్తాచెదారాల మధ్య ఉన్న విశ్రాంతి భవనం

మంత్రి సంధ్యారాణికి అభినందనలు



సంధ్యారాణిని అభినందిస్తున్న శ్రీనివాసరావు

పాలకొండ: రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని పాలకొండ నియోజకవర్గ నాయకులు శనివారం అభినందించారు. టీడీపీ నాయకులు మోజూరు తేజోవతి, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు గర్భాన సత్తిబాబు, పాలకొండ మండల పార్టీ అధ్యక్షుడు గండి రామినాయుడు, మాజీ సర్పంచ్ కోట సంగం నాయుడు, గార్ల రాంబాబు, మాదాసి సంతోష్, డొంక శివకుమార్, మిడతాన హరిబాబు, పెట్టా సాయికుమార్ కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

సాలూరు రూరల్: మంత్రి సంధ్యారాణికి మండలానికి చెందిన టీడీపీ నేతలు ఆముదాల పరమేశు, మత్స శ్యాంసుందర్,మత్స విజయబాస్కర్ అభినందించారు.

●పార్వతీపురం ఆంధ్రజ్యోతి: మంత్రి సంధ్యారాణిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, బీజేపీనాయకులుసాలూరులో కలిసి అభినందించారు.

జ్వరాలపై దృష్టి సారించండి

● పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ



సీతంపేట: ఏరియా ఆసుపత్రిలో మలేరియా జ్వరంతో బాధపడుతున్న టీడీపీ మండల కన్వీనర్‌ను పరామర్శిస్తున్న జయకృష్ణ

సీతంపేట: సీతంపేట మన్యంలో మలేరియా జ్వరాలు అధికంగా ఉండడంతో నివారణపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆదేశించారు. శనివారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో మలేరియా జ్వరంతో చికిత్స పొందుతున్న టీడీపీ మండల కన్వీనర్ సవర తోట ముఖలింగం, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బిడ్డిక రాజబాబును పరామర్శించారు. కాగా వేంకటేశ్వరస్వామి, త్రినాథస్వామి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్టీ మండల కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ కృష్ణారావు ఎమ్మెల్యేను సీతంపేటలో కలిశారు. కార్యక్రమంలో తోటపల్లి రిజర్వాయర్ మాజీ ఛైర్మన్ నిమ్మక పాండురంగ, పాలకొండ ఏరియా ఆసుపత్రి మాజీ ఛైర్మన్ వెన్నపు శ్రీనివాసరావు, మండంగి ప్రకాష్, బిడ్డిక చంద్రరావు, హిమరిక ప్రసాద్, బంగారు బండి జనార్దనరావు, దేవరశెట్టి కృష్ణ, కందుల రాజేష్, వేమకోటి సాయిశర్మ, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● పాలకొండ: పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు ఉత్తరాంధ్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘ కన్వీనర్, ఏపీ ప్రభుత్వోద్యోగుల సంఘ జిల్లా నాయకులు భరత్‌భూషణ్‌రాజు, గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబు, జిల్లా సచివాలయ సంఘ అధ్యక్షకార్యదర్శులు చిరంజీవి, రంగారావు అభినందించారు.అలాగే జయకృష్ణకు వీరఘట్టం మండలం రాజపురంలో ఈయూ ఆర్టీసీ జోనల్ సెక్రటరీ భాసూరు కృష్ణమూర్తి, మన్యం జిల్లా వర్కింగ్‌ప్రెసిడెంట్ దుమ్మెద దుర్గారావు, డిపో నాయకులు అభినందించారు. ఆయన్ను డిపో నాయకులు ఉమామహేశ్వరరావు, రవికుమార్, మేకల ఆనంద్, నాగభూషణరావు, ఆర్‌కేరావు, చందక ధనుంజయనాయుడు, గొడ్డల కృష్ణారావు, గడగమ్మ వెంకటరావు, బల్ల కృష్ణారావు, బల్ల హరిబాబు కలిశారు.

ఆలయాల అభివృద్ధికి సహకరిస్తా: జగదీశ్వరి



గుమ్మలక్ష్మీపురం: ఎమ్మెల్యే జగదీశ్వరిని సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

గరుగుబిల్లి: తోటపల్లిలోని వేంకటేశ్వర, కోదండరామస్వామి ఆలయాల అభివృద్ధి కి పూర్తిస్థాయిలో సహకరిస్తానని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. శనివారం ఆలయఈవో సూర్యనారాయణతో పాటు ఆలయ సిబ్బంది ఎమ్మెల్యేను కలిశారు. ఆలయ పరిధిలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులపై వివరించారు. తోటపల్లికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వారు కోరారు. అభివృద్ధికి దేవదాయశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు తెలిపారు.

● గుమ్మలక్ష్మీపురం: కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన విశ్రాంత ఉద్యోగులు రిటైర్డ్ ఉద్యోగి గుడివాడ ప్రభాకరరావు ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు బేతా కృష్ణమూర్తినాయుడు, గుడ్ల హరిప్రసాద్, బగ్గం బాబ్జీ, ప్రసాద్ పాల్గొన్నారు. కాగా జిల్లాలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న సుదర్శన్‌దొర జగదీశ్వరిని కలిశారు. అలాగే టీడీపీ నాయకులు గొట్టాపు వెంకట్‌నాయుడు, దేవకోటి వెంకట్‌నాయుడు తదితరులు కూడా జగదీశ్వరిని కలిశారు.

●కురుపాం రూరల్: నియోజకవర్గం పరిధిలోగల బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు మొండెంఖల్‌కు చెందిన బాలకృష్ణమిశ్రో ఆధ్వర్యంలో జగదీశ్వరిని కలిశారు. మొండెంఖల్‌లోని పొందర కులస్థులు ఎమ్మెల్యేను కలిసి అభినందించారు.

విద్యాభివృద్ధికి ప్రాధాన్యం

●పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర



పార్వతీపురం రూరల్: విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న విజయచంద్ర

పార్వతీపురం రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. శనివారం మండలంలోని మందులు పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ కిట్లతో పాటు పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. సరైన ఆలోచన లేకుండా కొన్ని పాఠశాలలను మూసివేయడం వల్ల ఎంతో మంది విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమయ్యారన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదవుకోవాలని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. కార్య క్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పగడాలమ్మ, ఎంఈవోలు సామల సింహాచలం, కర్రి ప్రసాదరావు, టీడీపీ నాయకులు జి.వి.నాయుడు, బోను దేవి,చంద్రమౌళి, బార్నాల సీతారాం, సంకరపు శంకరరావు, ప్రధానోపాధ్యాయులు జి.వాసుదేవరావు, యూటీఎఫ్ నాయకులు ఎస్.మురళీమోహన్‌రావు పాల్గొన్నారు. అలాగే పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను వివిధశాఖల అధికారులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు కలిసి అభినందించారు.

చెదలు తొలగించారు



కిటికీ ఏర్పాటు చేసిన దృశ్యం

గరుగుబిల్లి: స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో పేరుకు పోయిన చెదలను అధికారులు తొలగించారు. అభివృద్ధి కార్యాలయం దుస్థితిపై ఈ నెల 4న ఆంధ్రజ్యోతిలో కిటికీలు ఊడి.. రికార్డులకు చెదలు పట్టి శీర్షికతో కథనం వెలువడింది. దీంతో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.అర్జునరావు స్పందించి పూర్తిస్థాయిలో చెదలు తొలగించడంతో పాటు కిటికీలు, కార్యాలయం తలుపులతో పాటు అవసరమైన కార్యాలయ నిర్వహణ సామగ్రిని ఏర్పాటు చేశారు. శిథిలావస్థకు చేరిన భవనం పరిస్థితిపై స్థానిక ఎంపీపీ సహకారంతో మరమ్మతుకు జిల్లా పరిషత్ సీఈవోకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. నిధులు మంజూరు కాగానే అవసరమైన నిర్వహణ పనులు చేపడతామని చెప్పారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



ఒకటో తరగతిలో చేరేందుకు అర్హత పొందిన పిల్లలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న సూపర్‌వైజర్లు

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మి, అరుణకుమారి కోరారు. శనివారం కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రావివలస, పెదగుడబ సెక్టార్లలోని అంగన్ వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా రావివలస, సం తోషపురం, పెదగుడబ, తదితరగ్రామాల్లోని అంగన్‌వాడీకేంద్రాల్లో పిల్లల తల్లిదండ్రు లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత సంవత్స రం నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న పిల్లలు ఏమి నేర్చుకున్నారు, వారి ఎదు గుదలకు ఎలా సహాయపడింది, తదితర అంశాలను సూపర్‌వైజర్లు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు స్వేచ్ఛ పూరితమైన విద్యనందించినట్లు తెలిపారు. కాగా ఒకటో తరగతిలో చేరేందుకు అర్హత పొందిన పిల్లలకు సూపర్‌వైజర్లు ధ్రువపత్రాలను అందజేశారు.

రైతులకు విత్తనాల సరఫరా: ఏవో

గరుగుబిల్లి: మండలంలోని 13 రైతుభరోసా కేంద్రాల పరిధిలో రైతులకు పూర్తిస్థాయిలో విత్తనాలు సరఫరా చేశామని ఏవో ఆర్.విజయభారతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి సంబంధించి 2,250 క్వింటాళ్ల సాంబ, స్వర్ణ, 1064 రకాల విత్తనాలను ప్రభుత్వ నిబంధనల మేరకు అందించినట్లు పేర్కొన్నారు. విత్తనాల కొరత లేకుండా చర్యలు చేపట్టా మని తెలిపారు.

తల్లిదండ్రుల సేవే మాధవ సేవ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పార్వతీపురంటౌన్: తల్లిదండ్రుల సేవ.. మాధవ సేవని మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్, టీడీపీ నాయకులు బెలగాం జయప్రకాష్ నారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ పింఛనర్ల భవనంలో ఐఆర్‌పీడబ్ల్యూఏ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వయోవృద్ధులను వారి పిల్లలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. వృద్ధాప్యంలో అండగా ఉండాల్సింది కుటుంబ సభ్యులేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ ఎం.శ్రీరాములు. న్యాయవాది జోగారావు, కవి జి.గౌరునాయుడు, ఐఆర్‌పీడబ్ల్యూ డైరెక్టర్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

రోజు రూ.400 వేతనం ఇవ్వాలి

●వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

కురుపాంరూర ల్: ఉపాధి పనులకు హాజరయ్యే వేతనదారులకు రోజుకు రూ. 400 వేతనం అందేలా ప్రభుత్వం కృషిచేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్‌చేశారు. శనివారం సంగెడ్డ గ్రామంలోని వేతనదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేతన దారులు కష్టసుఖాలను అడిగితెలుసుకున్నారు. ఉపాధి పనులు రెండో పూట రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

జాబ్‌కార్డులు అందజేయండి



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

వీరఘట్టం: జాబ్‌కార్డు లేని వారికి త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఎంపీడీవో ఎంవీవీ సుబ్రహ్మణ్యం సూచించారు.శనివారం వీరఘట్టంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లోని ఉద్యోగ కల్పన పెంచాలని కోరారు. ఉపాధి పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పంట కాలువల్లో ఉపాధి పనులు

వీరఘట్టం: మండలంలోని కిమ్మి, చిట్టిపుడివలసల్లోని పంట కాలువల్లో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్నామని ఏపీవో సత్యంనాయుడు తెలిపారు.ఈ మేరకు కిమ్మిలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కాలువల్లో పూడికలు, మట్టిని తొలగించి గట్టును పటిష్టం చేసే పనులు చేపడుతున్నామని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే



సాలూరులో గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పాల్గొన్న చిన్మయిదేవి

సాలూరు రూరల్: పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసి ప్రాథమిక పాఠశాలలకు వెళ్లనున్న విద్యార్థులకు స్నాతకోత్సవం తరహాలో గ్రాడ్యుయేషన్ వేడుకలను నిర్వహించి పట్టాలిస్తుండడం విశేషం. తల్లుల సమక్షంలో ఈ వేడుకలను నిర్వహించి శిశు విద్యపై అవగాహన కల్పిస్తున్నారు. తమ చిన్నారి డిగ్రీ పట్టా తీసుకోవడమే లక్ష్యంగా నిర్ణయించుకోవడానికి అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ వేడుకల ప్రధాన ఉద్దేశమని సాలూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి వివరించారు. వేడుకలు పరిశీలనకు శనివారం ఐసీడీఎస్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ జి.చిన్మయిదేవి సాలూరులో పర్యటించారు. ఈ వేడుకల నిర్వహణపై ఆమెకు పీడీ ఎంఎన్ రాణి వివరించారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా

వీరఘట్టం: మండలంలోని నడుకూరు, నడమికెల్ల, కడకెల్ల, రేగులపాడు, విక్రంపురంల్లో యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా అవుతోంది. ప్రధానంగా ఖాళీ స్థలాలు, వాణిజ్య సముదాయాలు ఎత్తు పెంచేందుకు, ఇటుక బట్టీలకు మట్టి అవసరం. కాగా మట్టి రవాణాకు మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని, ఎవరికీ అనుమతి ఇవ్వలేదని డీటీ సీహెచ్ సత్యనారాయణ తెలిపారు. ఈ విషయాన్నిపరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



నడుకూరులో ఖాళీ స్థలంలో మట్టి నింపుతున్న దృశ్యం